# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 08-12-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, ఇంధన రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కేంద్ర గృహ నిర్మాణ, ఇంధన శాఖల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు.**

2. **రాష్ట్రవ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్ల తనిఖీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.**

3. **కబడ్డీ క్రీడ ధైర్యం, వ్యూహం, ఐక్యతకు నిదర్శనమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.**

4. **రాష్ట్రాన్ని క్షయ రహితంగా మార్చేందుకు శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు.**

5. **ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఏటా డిసెంబరు 15వ తేదీన ఆత్మార్పణ దినంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.**

=========================

గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, ఇంధన రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కేంద్ర గృహ నిర్మాణ, ఇంధన శాఖల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన రాష్ట్ర గృహ నిర్మాణం, విద్యుత్, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. గృహ నిర్మాణ, పురపాలక- పట్టణాభివృద్ధి, ఇంధన రంగాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రశంసించారు. ఈ సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రధానమంత్రి అవాస్ యోజన అర్బన్ 2.0 కి శ్రీకారం చుట్టామన్నారు.

రాష్ట్ర పురపాలక-పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే అమృత్ 2 పథకం పనులు కొనసాగింపునకు సహకరించాలని కోరగా.. కేంద్రమంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పందించారు.

-------------------------

రాష్ట్రవ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్ల తనిఖీని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వంలో దివ్యాంగులు, ఇతర విభాగాల్లో అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారనే ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తొలి విడతగా జిల్లాకు ఒక గ్రామ, వార్డు సచివాలయాన్ని ఎంపిక చేస్తారు. అక్కడ తనిఖీలకు పక్క మండలానికి చెందిన అధికారులను నియమించనున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని పింఛన్‌దారుల సంఖ్య ఆధారంగా ఎన్ని బృందాలు అవసరమో నిర్ణయిస్తారు. ఈ బృందం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి, ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తుంది. ఈ మొత్తం ప్రక్రియ సోమ, మంగళవారాల్లో పూర్తి చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ.. సెర్ప్ ముఖ్యకార్యనిర్వహణాధికారి జి.వీరపాండ్యన్ ఆదేశాలు జారీ చేశారు.

---------------------------

కబడ్డీ క్రీడ ధైర్యం, వ్యూహం, ఐక్యతకు నిదర్శనమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ ఆంధ్ర సీనియర్ పురుషుల, మహిళల కబడ్డీ పోటీలను నిన్న రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఉత్తమ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటున్నారని చెప్పారు. వారిలో ఉత్తమ జట్టును ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపాలని పెమ్మసాని చంద్రశేఖర్ సూచిస్తూ...

వాయిస్ (32సెకన్లు)

---------------------------

జనవరి 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహాకుంభమేళాకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు భారీగా తరలిరావాలని ఉత్తర్‌ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ్‌ప్రసాద్ మౌర్య కోరారు. మహాకుంభమేళాకు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నిన్న ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయవాడలో కేశవ్‌ప్రసాద్ మౌర్య పాత్రికేయులతో మాట్లాడుతూ.. మహా కుంభ్-2025కు అన్ని రాష్ట్రాలనూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానిస్తోందని తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఇప్పటికే ఏర్పాట్లు చేశామని.. వంద పడకలతో ఆసుపత్రి, పది పడకల ఐసీయూ, పెద్దసంఖ్యలో వైద్య, ఆరోగ్య కార్యకర్తలను అందుబాటులో ఉంచామని కేశవ్‌ప్రసాద్ మౌర్య వెల్లడించారు.

---------------------------

పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. అతి వేగంగా ప్రయాణిస్తున్న కారు చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్షతగాత్రులను పిడుగురాళ్లలోని ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా ప్రాథమికంగా నిర్ధారించారు. మృతులను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలం సిరిపురానికి చెందిన వారుగా గుర్తించారు. తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లి కొత్తకారుకు పూజలు చేయించి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ.. శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో మాదకద్రవ్యాలపై అవగాహన పరుగు

నిర్వహించారు. నార్కోటిక్స్ పోలీస్ సూపరింటెండెంట్ నరేష్, తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుబ్బరాయుడు, శాప్ ఛైర్మన్ రవినాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి వేద విశ్వవిద్యాలయం వరకు 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల విభాగాల్లో ఈ పరుగు నిర్వహించారు. ఈ సందర్భంగా.. నార్కోటిక్స్ ఎస్పీ నరేష్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మారుద్దామని పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ సమాజంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని.. మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలను అడ్డుకోవడం మన బాధ్యత అని తెలిపారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాదక ద్రవ్యాలపై మంత్రి నారా లోకేష్ యుద్ధం ప్రకటించారని.. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

---------------------------

రాష్ట్రాన్ని క్షయ రహితంగా మార్చేందుకు శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన విజయనగరం జిల్లాలో 'ని-క్షయ్ శివిర్' 100 రోజుల కార్యక్రమం జరగనుంది. జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా నిన్న వర్చువల్‌గా ప్రారంభించారు. దీనికి అనుబంధ కార్యక్రమం గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 76 వేల 590 మంది టీబీ బాధితులు ఉన్నారని, క్షయ వ్యాధి, మరణాల రేటును గణనీయంగా తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి. శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 32 సెకన్లు....

---------------------------

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా డిసెంబరు 15వ తేదీన ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ రాజకీయ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సచివాలయం, కమిషనరేట్‌లు, జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై విద్యాసంస్థల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని సూచించారు.

---------------------------

ఆడపిల్లలను రక్షించుకుందాం, భ్రూణ హత్యలు నిర్మూలిద్దాం, వారిపై దాడులు, హత్యలను అడ్డుకుందామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ఆడపిల్లల రక్షణపై అవగాహన కోసం 2 కిలోమీటర్ల పరుగు కార్యక్రమం ఏర్పాట్లపై పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

... వాయిస్...27 సెకన్లు

==============================